# బీసీల ఆత్మబంధువు కేసీఆర్

- కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ద్రోహం
- కేసీఆర్ గెలవడం చారిత్రక అవసరం
- విభిన్నమైన పథకాలతో బీసీలకు ప్రయోజనం
- అవగాహనరాహిత్యంతోనే బీఆర్ఎస్‌పై నిందలు
- తెలంగాణలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారు
- ''నమస్తే తెలంగాణ''తో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



ఇంటర్వ్యూ

నిజామాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో ఆయనో కీలకమైన బీసీ నేత. కాంగ్రెస్ పార్టీలో తెలంగాణకు మొట్ట మొదటి పీసీసీ చీఫ్. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ శాఖలకు మంత్రిగా దశాబ్దం పాటు పని చేసిన వ్యక్తి. బీసీ నేతగా గుర్తింపు పొంది ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన ఆయనే వరంగల్ జిల్లా జనగామ నియోజకవర్గ బిడ్డ పొన్నాల లక్ష్మయ్య. కాంగ్రెస్ పార్టీలో బీసీల వాటాను అడిగినందును ప్రస్తుతం అరువు తెచ్చుకున్న పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేతిలో తీవ్రమైన రీతిలో అవమానానికి గురయ్యారు. తన వయసుకు సైతం గౌరవం ఇవ్వకుండా పొన్నాలను రేవంత్ రెడ్డి అవమానించడంతో పాటు పరుష పదజాలంతో నిందించడంతో పొన్నాల తీవ్రంగా కలత చెందారు. తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో ఎదురైన తీరును చూసి, బీసీ నేతలకు దక్కుతోన్న ప్రాధాన్యతను గమనించి హస్తం పార్టీని వీడారు. దేశం, రాష్ట్రంలో బీసీలకు గౌరవం దక్కే చోటుకోసం చూస్తున్న పొన్నాల లక్ష్మయ్యకు కేవలం కేసీఆర్ రూపంలోనే బీసీ ఆత్మబంధువు కనిపించారు. కేసీఆర్‌తో ఉన్న రాజకీయ అనుబంధంతో భారత రాష్ట్ర సమితిలో చేరిన ఆయన ఎన్నికల ప్రచార నిమిత్తం నిజామాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్యతో 'నమస్తే తెలంగాణ' మాట్లాడగా పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు మీ కోసం...

**కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి...**

కాంగ్రెస్ పార్టీలో బీసీలకు స్థానమే లేదు. రాష్ట్రంలో 54శాతం మంది బీసీలుంటే వారిచ్చిన సీట్ల సంఖ్య ఎంతనో గమనిస్తే ఈ విషయం అర్థమైపోతుంది. పార్టీని నడుపుతున్న వారు, వారి వెనుకున్న వారెవ్వరో అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ పెద్ద మనుషులు ఈ ప్రాంతాన్ని గతంలో 40 ఏండ్లు పరిపాలించినా 50 శాతం ఎమ్మెల్యేల టికెట్లు కూడా బీసీలకు రాకపోవడానికి కారకులు ఎవరు. అందుకే బీసీలకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీయే. తెలంగాణలో బీసీ నాయకత్వాన్ని ఎదుగనియ్యకుండా చేయడంలోనే కాంగ్రెస్ పార్టీ విజయవంతమైంది. బీసీలంతా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాల్సిన అవసరం ఏర్పడింది. కుట్రలు, కుతంత్రాలను పటాపంచలు చేస్తూ కేసీఆర్‌కు మద్దతు తెలపడం ప్రస్తుతం చారిత్రక అవసరం. సాగుకు 3గంటలు కరెంట్ సరిపోతుందని చెప్పే వ్యక్తులున్న కాంగ్రెస్ పార్టీని నమ్మకూడదు. వ్యవసాయానికి ఎకరానికి గంట చొప్పున కరెంట్ ఇస్తే సరిపోతుందనడం ఆ నాయకుడి మూర్ఖత్వం. కాంగ్రెస్ పార్టీ దౌర్భాగ్యం. తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉండడానికి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణం. ఈ విషయంపై ఎవరైనా కాంగ్రెస్ పెద్ద మనుషులు వస్తే నేను చర్చించడానికి రెడీగా ఉన్నాను. దమ్ముంటే నా సవాల్‌ను కాంగ్రెస్ నేతలెవ్వరైనా స్వీకరించాలి.

**కేసీఆర్ గెలవడం బీసీలకు చారిత్రక అవసరం...**

బీసీలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటాపోటీగా పని చేస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి సైతం బీసీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదు. వారు కేవలం రాజకీయ కోణంలోనే బీసీలను చూస్తున్నారు తప్ప బీసీలను నిత్యం మోసం చేస్తూనే ఉన్నారు. బీసీలను వంచించడంలో కాంగ్రెస్, బీజేపీలు దొందు దొందే. ఒకరిని మించి మరొకరు పోటాపోటీగా బీసీలను మోసం చేస్తున్న తీరును వెనుకబడిన వర్గాలకు చెందిన విజ్ఞులంతా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే నా ద్వారా చేతనైనంతగా బడుగు, బలహీన వర్గాల ప్రజలను చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తున్నాను. నిజామాబాద్ ప్రాంతానికి రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. రాజకీయంగా చైతన్యవంతమైన ఇక్కడి ప్రజలంతా బీసీలను ద్వేషించే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరుతున్నాను. నిజామాబాద్‌లో రైతులు పండించే పసుపు పంటకు ఎనలేని గుర్తింపు ఉంది. ఈ పసుపుతో రోగాలను నయం చేసే గుణం ఉంది. ఆ విధంగానే రాజకీయ రుగ్మతలను పారదోలే విధంగా ప్రజలంతా ఓటుతో జాతీయ పార్టీలకు తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరుతున్నాను. ముఖ్యంగా బీసీ ప్రజలంతా ఐక్యంగా ఉంటూ బీఆర్ఎస్ ప్రభుత్వానికే మద్దతు ఇవ్వాలి.

### కాంగ్రెస్‌లో ఆత్మగౌరవం లేదు

తెలంగాణ కోసం 2001లో 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంతకాలు చేసి పంపిన వారిలో మొదటి సంతకం పెట్టిన వ్యక్తిని నేనే. తెలంగాణ కోసం నేను మొదట్నుంచి నా వంతుగా చిత్తశుద్ధితో కృషి చేశాను. రాష్ట్రంలో పుష్కర కాలం పాటు మంత్రిగా అనేక శాఖలకు బాధ్యతలు నిర్వర్తించాను. కాంగ్రెస్ పార్టీలో కీలకమైన పదవులను అంకితభావంతో, అత్యంత నిబద్ధతతో, క్రియాశీలకంగా 40 ఏండ్ల పాటు సేవ చేశాను. అలాంటి నాకు అత్యంత నీచంగా, బీసీ లీడర్‌గా ఉన్న నన్ను అవమానకరంగా ఇబ్బందులకు గురి చేసిన ఘటనలను గుర్తుకు తెచ్చుకుంటేనే భయమైతున్నది. కాంగ్రెస్ పార్టీలో ఒక బీసీ నేతకు దక్కిన అవమానాన్ని ప్రజలంతా గమనించారు. ఇప్పుడు ఆ పార్టీ ఎవరి చేతుల్లో ఉంది. ఆ పార్టీని ఎవరు నడిపిస్తున్నారో అందరికీ అర్థమైంది. హస్తం పార్టీలో బీసీ నాయకులెవ్వరూ పనికి రారని, వాళ్లు ఓడిపోయే వాళ్లంటూ టికెట్లు ఇవ్వకుండా పక్కన పెడుతున్నారు. ఇదంతా కుట్రపూరితంగా జరుగుతున్నదేనని నేను చెబుతున్నాను. కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి అనుబంధం లేని వ్యక్తులను, పార్టీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే వాళ్లు బజారులో గొడ్లను అమ్మినట్లు పార్టీ టికెట్లను అమ్ముకున్నారు.

# కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికేతరులే



స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

- నిత్యం ప్రజల కోసం పరితపించే వ్యక్తి పోచారం శ్రీనివాసరెడ్డి
- మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

బాన్సువాడ, నవంబర్ 7 : బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డిని ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి కోరారు. పోచారం శ్రీనివాసరెడ్డి తరపున మంగళవారం నామినేషన్లను దాఖలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడలో కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు దొరక్కపోవడంతో స్థానికేతరులు బరిలో నిలిచారన్నారు. 74 ఏండ్ల వయసులో పోచారం యువకుడిలా ప్రతినిత్యం నియోజక వర్గ ప్రజల కోసం పరితపించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. నెలలో ఒక్క రోజే కుటుంబంతో గడుపుతారని, మిగిలిన 29 రోజులు నియోజక వర్గ ప్రజలకు పనిచేసేందుకు అందుబాటులో ఉండే నాయకుడు పోచారం అన్నారు. ఆయనకు నియోజకవర్గ ప్రజలే కుటుంబ సభ్యులు అన్నారు. నియోజక వర్గంలో పదివేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలోనే రూ.150 కోట్లతో డబుల్ రోడ్లు, గల్లీగల్లీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి పేదలకు అందించారని తెలిపారు.

మరోసారి నియోజకవర్గ ప్రజలు స్థానికుడైన పోచారం శ్రీనివాస రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించి, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మెన్ నెర్రె నర్సింహులు. ఖయ్యుంనిషాత్, దుర్కి గ్రామ సర్పంచ్ శ్యామలా శ్రీనివాస్, కౌన్సిలర్ తార, ఎంపీటీసీ సందీప్ పటేల్, వినయ్‌కుమార్, లక్ష్మాపూర్ సర్పంచ్ సత్యనారాయణ , రుద్రూర్ నాగేందర్ తదితరులు ఉన్నారు.

# ఉమ్మడి జిల్లాలో మరో 21 నామినేషన్లు దాఖలు

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, నవంబర్ 7 : శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మంగళవారం 13 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఆర్మూర్ సెగ్మెంట్‌లో చెరుకు ప్రేమ్‌కుమార్ (ధర్మసమాజ్ పార్టీ), పి.వినయ్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) నామినేషన్లను సమర్పించారు. బోధన్ సెగ్మెంట్ నుంచి సయ్యద్ అస్గర్ (స్వతంత్ర), జునైద్ అఫ్జ ఖలీల్ (స్వతంత్ర) నామినేషన్ వేయగా, బాన్సువాడ సెగ్మెంట్ నుంచి నీరడి ఈశ్వర్(బీఎస్పీ), పరిగె శ్రీనివాసరెడ్డి(బీఆర్ఎస్) రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అర్బన్ నుంచి రాగి అనిల్ (స్వతంత్ర), ఫజల్ కరీం (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ), రాపెల్లి శ్రీనివాస్ (స్వతంత్ర) నామినేషన్లను దాఖలు చేశారు. రూరల్ సెగ్మెంట్ నుంచి పి.తిరుపతిరెడ్డి (స్వతంత్ర), బాజిరెడ్డి జగన్మోహన్ (స్వతంత్ర), కె. సుభాష్ (ధర్మసమాజ్ పార్టీ), ఆర్.ప్రశాంత్ (ధర్మసమాజ్ పార్టీ) నామినేషనున్ల సమర్పించారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి ఈ రోజున ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 37 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి నేటి వరకు 6 నామినేషన్లు, బోధన్ సెగ్మెంట్‌లో 6, బాన్సువాడలో 6, నిజామాబాద్ అర్బన్‌లో 10, నిజామాబాద్ రూరల్‌లో 6, బాల్కొండలో 3 నామినేషన్లు దాఖలయ్యాయి.

**కామారెడ్డి జిల్లాలో..**

కామారెడ్డి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మంగళవారం 8 నామినేషన్లు దాఖలు అయ్యాయని కలెక్టర్ జితేశ్ పాటిల్ తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి పెద్ద మహేశ్ అలియాస్ మోడెగామ మహేశ్ (స్వతంత్ర), జుక్కల్ నుంచి వాగ్మారే గంగాధర్(నవరంగ్ కాంగ్రెస్) నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా ఆకుల హరీశ్, చిదుర సాగర్ రెడ్డి, రవి నాయక్ భూక్యా, రాజు గిరి సంతోష్ రెడ్డి, సపావత్ సుమన్, మహ్మద్ తాహెర్ బిన్ అహ్మద్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. నాలుగు రోజుల్లో మొత్తం 33 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

# బీఆర్ఎస్‌కే జై..

ఎల్లారెడ్డి, నవంబర్ 7: షెడ్యూల్డ్ తెగల కోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ సర్కారుకే తమ పూర్తి మద్దతు ఉంటుందని లబానా (కాయితీ) లంబాడాలు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌పై తమకు పూర్తి నమ్మకం ఉన్నదని, మూడోసారి అధికారంలోకి వచ్చి తమ సమస్యలు పరిష్కరించడం ఖాయమన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నామినేషన్లు వేస్తున్నట్లు ప్రకటించిన తమ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసి వారు మాట్లాడారు. లబానా లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర విషయాలపై మంత్రికి విన్నవించారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, విద్య, ఉద్యోగం, ఉపాధి, సామాజిక, రాజకీయ అంశాల్లో అవకాశాలు కల్పించారన్నారు. గిరిజనుల కల సాకారం చేసేలా నాలుగు లక్షల ఎకరాలకుపైగా పోడు భూములకు పట్టాలు కేసీఆరే ఇచ్చినట్లు తెలిపారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారన్నారు. న్యాయసలహా అనంతరం సీఎం కేసీఆర్ ఆదేశాలతో లబానా లంబాడాలను ఎస్టీ జాబితాలోకి చేర్చడంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే అంశాన్ని తప్పక పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు. మంత్రి హరీశ్ రావుకు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో లబానా లంబాడా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్, అమర్ సింగ్ నాయక్, చందానాయక్, బిషన్ లాల్ నాయక్, జగదీశ్, గంగారాం, దర్బార్, గోపాల్ తదితరులు ఉన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**DISTRIBUTORS WANTED**

★Wanted 4G బ్రాండ్ పరోటా (Parota) ప్యాకెట్స్ మార్కెటింగ్ మరియు సేల్స్ కొరకు మండలాలు మరియు జిల్లాల వారీగా డిస్ట్రిబ్యూటర్లు కావలెను. 8074422844.

NT-320905

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.

NT-314452




**పాస్‌పోర్ట్ పోయినది**

బట్టు విశ్వనాథ్, తండ్రి జంగయ్య ఇ.నెం. 3-62/2, లక్కోర, మం॥వేల్పూర్, జి॥ నిజామాబాద్ నా పాస్‌పోర్ట్ నెం. J6979422, బైక్ పై వేల్పూర్‌కు వెళ్ళుచుండగా పోయినది. దొరికినవారు సంప్రదించు నెంబర్

సెల్: 6305030818

**CHANGE OF NAME**

I, GENTYALA RAVALI, H.No.4-61/12, Saraswathi Nagar, Mamidipally, Armoor, (D) Nizamabad. Changed my Surname /Name As RUQSANA BEGUM, W/o. SIRAJ UR RAHAMAN

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.